క్లుప్తంగా

మెప్మా బజార్ ప్రారంభం



మెప్మా బజార్‌లో షాపింగ్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ

గుత్తి: పట్టణంలోని ఓల్డ్ మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం డ్వాక్రా మహిళలు , మెప్మా ఆర్‌పీలు ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, కమిషనర్ జబ్బార్ మియా మెప్మా ప్రారంభించారు. మెప్మా బజారులో డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసిన అన్ని రకాల పిండి వంటలు, దుస్తులు, నగలు, ఆయుర్వేద మందులు తదితరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ పలు వస్తువులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, మెప్మా అధికారులు శ్రీనివాసరెడ్డి, చంద్ర, సురేఖ, శేఖర్, ఆర్పీలు పాల్గొన్నారు.

విద్యుత్‌తీగ తగిలి ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దుతో బాధిత రైతు హరిశ్చంద్ర

గుంతకల్లు రూరల్: నాగసముద్రంలో బుధవారం పొలంలో తెగిపడిన విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు.. రైతు హరిశ్చంద్ర తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, రెండు ఎద్దులతో బాడుగలకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం గ్రామంలో వేరే రైతు పొలానికి బాడుగకు వెళ్లాడు. పొలంలో పనిచేస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగ ఒక ఎద్దు కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు మృతితో రూ.70 వేల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

గంగిరెడ్డి కాలువలో పూడికతీత



జేసీబీతో పూడిక తీస్తున్న దృశ్యం

పామిడి: స్థానిక 4వ వార్డులోని మాలవీధి, దుర్గమ్మవీధిలో బుధవారం గంగిరెడ్డి కాలువ పూడికతీత పనులు చేపట్టారు. ఈఓ ఎం గోపాల్ ఆధ్వర్యంలో మేస్త్రీ సురేష్, పంచాయతీ సిబ్బంది జేసీబీతో పూడిక తొలగింపజేశారు. దీంతో కాలువలో మురుగునీరు ముందుకు సాగడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి



ఖాదర్ బాషా(ఫైల్)

గుత్తి: పట్టణంలోని జెండా వీధికి చెందిన ఖాదర్ బాషా(45) గుండెపోటుతో మృతి చెందాడు. మంగళవారం రాత్రి ఖాదర్ బాషా కు ఛాతిలో నొప్పి వచ్చింది. వెంటనే కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో అక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

పామిడిలో భారీ వర్షం



వర్షం కురుస్తున్న దృశ్యం

పామిడి: పామిడిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు వాన దంచికొట్టింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన నాయీబ్రహ్మణ కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, చైతన్యకాలనీ, వెంగమనాయుడు కాలనీ, బీసీ కాలనీ, నెహ్రూనగర్ కాలనీ తదితర కాలనీలు జల మయమయ్యాయి. రోడ్లపై వర్షపునీరు పారడంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు పడ్డారు.

ఆధార్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



ఎద్దులపల్లి రోడ్డులోని ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ తేజోత్స్న

పామిడి: పట్టణంలోని ఆధార్ కేంద్రాలను బుధవారం ఎంపీడీఓ కే తేజోత్స్న ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఎద్దులపల్లిరోడ్డు సచివాలయ కేంద్రంలో సాంకేతికలోపంతో ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం వచ్చి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాంకేతికలోపాన్ని అధిగమించి ప్రజలకు ఆధార్‌కార్డు అప్‌డేట్ సేవలను అందించాలని ఎంపీడీఓ నిర్వాహకులకు సూచించారు.

వంట.. తప్పని తంటా!

- ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులు కరువు
- వర్షాకాలంలో మధ్యాహ్న భోజనం తయారీకి తప్పని ఇక్కట్లు
- లబోదిబోమంటున్న ఏజెన్సీ నిర్వాహకులు



మోడల్ స్కూల్లో ఆరుబయట వంట చేస్తున్న వంట మనుషులు

యల్లనూరు: ప్రభుత్వ పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులకు ఇక్కట్లు తప్పడం లేదు. వర్షాకాలం కావడంతో మధ్యాహ్న భోజనం తయారీకి నానాకష్టాలు పడుతున్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 38 ఉన్నాయి. ఇందులో 2450 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నతపాఠశాలల్లో నాడు– నేడు కార్యక్రమం కింద గత ప్రభుత్వం వంట గదులు, తరగతి గదులు, మరుగుదొడ్లతోపాటు 11 రకాల వసతులు కల్పించింది. ఇంకా యల్లనూరు, వెన్నపూసపల్లి, కూచివారిపల్లి, తిమ్మంపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వంట గదులు నిర్మించాల్సి ఉంది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ విషయం గురించి పట్టించుకోవడం లేదు.

తప్పని అగచాట్లు..

ఉన్నత పాఠశాలల్లో వంట గదులు లేకపోవడంతో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నత పాఠశాలల్లో దాదాపు1200 మంది విద్యార్థులున్నారు. వీరిందరికీ రోజు మధ్యాహ్న భోజనం తయారు చేయాల్సి ఉంది. వంట గదులు లేకపోవడంతో ఆరుబయట వండాల్సి వస్తోంది. వర్షాకాలం కావడంతో వంటచెరుకు తడిసి నిర్వాహకులు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఉన్నత పాఠశాలల్లో వంట గదులు నిర్మించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

జెడ్పీ హైస్కూల్	విద్యార్థుల సంఖ్య
యల్లనూరు	340
వెన్నపూసపల్లి	70
కూచివారిపల్లి	102
తిమ్మంపల్లి	340
చిలమకూరు మోడల్ స్కూల్	294

రోగాల బారినపడుతున్నాం



వర్షాలకు సరిగ్గా కట్టెలు అంటుకోవడం లేదు. పొగ కారణంగా రోగాల బారినపడుతున్నాం. వంట గదులు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అన్నం సక్రమంగా పెట్టాలని ప్రతి ఒక్కరూ అంటారు. కనీస సౌకర్యాలు వంటగదులు మాత్రం కట్టించరు.

– నాగలక్షుమ్మ, మోడల్ స్కూల్, వంట మనిషి

ఆరు బయటే వండుతున్నాం



అరకొర వసతులతోనే ఆరు బయట వంటలను వండుతున్నాం. వర్షాకాలంలో చాలా ఇబ్బందులు పడుతున్నాం. వందల మంది విద్యార్థులకు ఆరు బయట వంటలు చేయాలంటే చాలా కష్టంగా ఉంది. పూట గడవక వంట వండేందుకు వస్తున్నాం. అధికారులు వంటగదులను ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

– లక్ష్మిదేవి, వంటమనిషి

వంట గదులు లేక అవస్థలు



మోడల్ స్కూల్లో వంట గదులు లేక వర్షాకాలంలో అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో 200 మంది పిల్లలకు పైగా చదువుకుంటున్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి, మండల స్థాయి అధికారులు స్పందించి మాకు వంట గది నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాను.

– మహేష్, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్

నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక నాయకులు

గుంతకల్లు: ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నియామకాలు నిబంధనలకు విరుద్ధంగా చేపట్టారని ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక నాయకులు ఆరోపించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. ఇటీవల బదిలీ అయిన ఆర్‌డీఓ శ్రీనివాసులురెడ్డి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఇతర సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించారన్నారు. దీనిపై ఆయన్ను ప్రశ్నించగా జీఓ ప్రకారం ఇతర సామాజిక వర్గాలకు చెందిన వారిని నియమించామని చెప్పారన్నారు. అయితే ఇక్కడే అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించారన్నారు. రిలేటింగ్‌కు బదులు ఆదర్ ద్యాన్ ఎస్సీ, ఎస్టీ ఎన్జీవోస్ అని మార్పు చేసుకున్నారని ఆరోపించారు. వెంటనే ఈ నియామాకాన్ని రద్దు చేసి అర్హులైన ఎస్సీ, ఎస్టీలకే మానిటరింగ్ కమిటీల్లో చోటు కల్పించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఐక్యవేదిక నాయకులు ఎం.మహేంద్ర, తగరం రామాంజినేయులు, భీమలింగ, కే.చంద్రశేఖర్, నరసింహులు, వై.ఎర్రిస్వామి, మల్లికార్జున, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పెన్నా ఆక్రమణలను పరిశీలించిన ఆర్డీఓ

సాక్షి ఎఫెక్ట్..



పామిడిలో పెన్నానది ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

పామిడి: పామిడి పెన్నానదిలోని ఆక్రమణలను బుధవారం సాయంత్రం గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ పరిశీలించారు. 'యథేచ్ఛగా ఆక్రమణ శీర్షికన సాక్షిలో బుధవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్డీఓ తహసీల్దార్ ఎన్ శ్రీధర్ మూర్తి, రెవెన్యూ సిబ్బందితో కలిసి పెన్నానది ఆక్రమణలను స్వయంగా పరిశీలించారు. పెన్నానదిలోని ఆక్రమణలకు తక్షణమే కొలతలు వేయించి ఎవరి స్వాధీనంలో ఎంత ఉన్నది గుర్తించి ఏపీ ల్యాండ్ ఎంక్రోచ్‌మెంట్ యాక్ట్ మేరకు తగిన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సమావేశమై విధి నిర్వహణలో పాటించాల్సిన విధివిధానాలను నిర్దేశించారు. పీజీఆర్ఎస్ పిటీషన్లకు తక్షణమే అటెండ్ కావాలని ఆదేశించారు. అనంతరం ఆర్డీఓ ఆదేశాల మేరకు తహసీల్దార్ పెన్నానది ఆక్రమణల గుర్తింపు నిమిత్తం ఆరు బృందాలను ఏర్పాటు చేశారు. టీమ్‌లోని వీఆర్వోలు, సర్వేయర్ల నదీ ఆక్రమణలపై సర్వే చేసి నివేదికను సమర్పించాలంటూ ఆయన వారికి లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంకుడు గుంతల కోసం దరఖాస్తు చేసుకోండి



భూమిపూజ చేస్తున్న అధికారులు

శింగనమల: మండలంలో ఆసక్తి కలిగిన వారు ఇంకుడు గుంతల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నిర్మలాకుమారి సూచించారు. నీటి సంరక్షణ పథకంలో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వర్షం నీరు నిల్వ కోసం ఇంకుడు గుంత నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మండలానికి 1000 ఇంకుడు గుంతలు మంజూరయ్యాయని, ఒక్కో నిర్మాణానికి రూ.6వేల చొప్పున మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, ఈసీ దామోదర్, ఏపీఓ శ్రీదేవి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయండి



వేరుశనగ దిగుబడిని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

గుత్తి రూరల్: వేరుశనగ సాగు చేసి తొలగించిన రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త లక్ష్మణ్ సూచించారు. మండలంలోని కరిడికొండ, బాచుపల్లి గ్రామాల్లో బుధవారం శాస్త్రవేత్త పర్యటించి వేరుశనగ పంట దిగుబడిని పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ 1694 రకం వేరుశనగ పంట ఆశించిన దిగుబడులు వచ్చాయన్నారు. రైతులు వేరుశనగ తొలగించిన తర్వాత అలసంద, ఉలవలు, సజ్జ, జొన్న, మొక్కజొన్న తదితర వాణిజ్య పంటలను సాగు చేయాలన్నారు. కంది పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం రైతులు తొలగించిన వేరుశనగ దిగుబడిని పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు కల్యాణ్, సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.

యాడికి: పత్తి రైతులు గులాబీ రంగు పురుగు నివారణపై ప్రత్యేక దృష్టి ఉంచాలని రేకులకుంట శాస్త్రవేత్త లక్ష్మణ్, ఏఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. బుధవారం పెద్దవడుగూరులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ కారణంగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని కంది. పత్తి, పొగాకు, మిరప తదితర పంటలకు తెగుళ్ల ఆశించే ప్రమాదం ఉందన్నారు. పొలాల్లో నీటి నిల్వలు లేకుండా బయటకు పంపాలన్నారు. తెగుళ్ల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు

అనంతపురం: రక్తదానం చేయడం అంటే పునర్జన్మ కల్పించడమేనని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఇటుకలపల్లి పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, కదిరి ప్రాంతాల నుంచి యువత స్వచ్ఛందంగా పాల్గొని 100 యూనిట్ల రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమాజ భద్రత, రక్షణ క్రమంలో పోలీసులు ప్రాణత్యాగం చేస్తున్నారన్నారు. అమరవీరుల సేవలు, త్యాగాలు స్మరించుకుంటూ వారోత్సవాలు జరుపుకుంటున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి మంజుల

గుంతకల్లు రూరల్: తల్లిదండ్రులు, కుటుంబానికి దూరంగా ఉంటూ హాస్టల్ చదివే విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని గుంతకల్లు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జీ.మంజుల సిబ్బందికి సూచించారు. బుధవారం రాత్రి ఆమె పట్టణంలోని హనుమేష్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె హాస్టల్ నిర్వాహకులతో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత, విద్యార్థుల హాజరు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో హాస్టల్ నిర్వహణ, వారికి ఉన్న ఇబ్బందులపై ఆరా తీశారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మోడల్‌స్కూల్ విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ బుధవారం తెలిపారు. అనంతపురము జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సెంటర్‌లో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు 11 మంది అత్యంత ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. ఈనెల 27 నుంచి 29 వరకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు, పీఈటీ వెంకటేష్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బుక్కరాయసముద్రం: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుంధర పేర్కొన్నారు. అనంతపురంలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14, 17 బాల బాలికల బాస్కెట్‌బాల్ ఉమ్మడి అనంతపురం జిల్లా ఎంపికలు నిర్వహించారన్నారు. అండర్–17 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన యగ్నేష్ యశ్వంత్, బాలికల విభాగంలో నాగ నందిని, బాస్కెట్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 26న వెస్ట్ గోదావరి జిల్లాలో మార్టేరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. అండర్–14 విభాగంలో గణేష్, రాజు, బాలికల విభాగంలో నేహా, భావన ఎంపికయ్యారన్నారు. వీరు నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు పల్నాడు జిల్లాలోని నరసారావు పేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎంతోపాటు పీడీ గోపాల్‌రెడ్డి, లలితమ్మ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల చేయాలి




వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తాడిపత్రిటౌన్: డిగ్రీ, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన డబ్బు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు వారు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు వచ్చే నెల నుంచి పరీక్షలు జరగున్నాయన్నారు. ఫీజు పెండింగ్ ఉండటంతో వారిని పరీక్షలకు అనుమతి ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే రూ.2,100 కోట్లు ఫీజు రియింబర్స్‌మెంట్, రూ.1400 కోట్లు వసతిదీవెన డబ్బును విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ తాడిపత్రి నియోజకవర్గ అధ్యక్షుడు ఓబులేసు, కోశాధికారి రాకేష్, నాయకులు యువరాజ్, నాగార్జున, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

గుత్తి: కొత్తూరులో ఉన్న అనాథ ఆశ్రమంలో బుధవారం రిటైర్డ్ టీచర్ సోమప్ప కుటుంబసభ్యులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సోమప్ప జ్ఞాపకార్థం వృద్ధులు, అనాథలకు అన్నదానంతోపాటు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో దాతలతో పాటు గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్ పాల్గొన్నారు.

122 మందికి వినికిడి లోపం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీలో బుధవారం దీన్ దయాల్ శ్రవణ ఫౌండేషన్, జాతీయ వినికిడి లోప నిర్మూలన కార్యక్రమం–నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. 122 మందికి వినికిడి సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. 0–19 ఏళ్ల వయసు కల్గిన 126 మంది క్యాంపుకు హాజరయ్యారన్నారు. కాగా అందులో 114 మంది పిల్లలు, 8 మంది పెద్దలకు వినికిడి సమస్య ఉన్నట్లు నిర్ధారించినట్లు తెలిపారు. త్వరలో వీరికి వినికిడి పరికరాలను అందించేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ రాజేష్, దీన్ దయాల్ సొసైటీ రాష్ట్ర చైర్మన్ రామాంజనేయులు, కో–ఆర్డినేటర్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ విశ్వవిద్యాలయ జట్టుకు 'ఎస్‌ఆర్‌ఐటీ' విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అంతర్ విశ్వ విద్యాలయ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ బుధవారం తెలిపారు. కళాశాలకు చెందిన పూజిత చెస్, మహమ్మద్ మన్సూర్ క్రికెట్, సాయి జ్యోతిక బాస్కెట్‌బాల్‌లో అంతర్ విశ్వ విద్యాలయ జట్టుకు ఎంపికయ్యారన్నారు. తాము విద్యతో పాటు క్రీడా రంగంలోనూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ అమరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

షెడ్ల నిర్మాణం వేగవంతం చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి

యల్లనూరు: మండలవ్యాప్తంగా గోకులం పథకం కింద పశువుల షెడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ముందు ఇంకుడు గుంతలు తవ్వుకునేలా ప్రోత్సహించాలన్నారు. దీనిపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. టీఏలు శంకర్, జయరాం, అదిల్, శ్రీనివాసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిరంతరం అప్రమత్తంగా ఉండాలి



అప్పేచెర్ల చెరువును పరిశీలిస్తున్న అధికారులు

యాడికి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చెరువుల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు మండల అధికారులను ఆదేశించారు. బుధవారం పెద్దవడుగూరు మండలంలోని అప్పేచెర్ల చెరువును ఆయన మైనర్ ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. రానున్న రెండు రోజుల్లో చెరువులోకి వరద నీరు వచ్చే అవకాశం ఉందని, చెరువు నీటి సామర్థ్యం, చెరువు కాలువ గట్ల భద్రత, మరువ తదితర విషయాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ ఉషారాణి, ఇరిగేషన్ ఏఈ నూర్జాహాన్, వీఆర్వోలు ఉన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం ఒక్కో రైతుకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేల చొప్పున అందించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హెచ్చెల్సీ కుడి కాలు వ ద్వారా 49 చెరువులకు నీరు అందించాలన్నారు. అలాగే మిడ్ పెన్నార్ డ్యాం ద్వారా 140 రోజులు ఆయకట్టుకు సాగునీరు అందించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లను నియంత్రించండి

గార్లదిన్నె: మండలంలో పెన్నానది నుంచి ఇసుక తరలించే ట్రాక్టర్లను నియంత్రించాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనాథ్ చౌదరి అధికారులను కోరారు.బుధవారం ఆయన మాట్లాడుతూ రాత్రి, పగలు ఇసుక ట్రాక్టర్లు అతివేగంగా గ్రామాల్లో వెళ్తుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్నారన్నారు. ఇసుకపై కనీసం టార్పాలిన కూడా కట్టకపోవడంతో ఇసుక రేణువులు కళ్లలోకి పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాక్టర్ల విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.